సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం ౹ 11 ౹ అక్టోబర్ ౹ 2022

13న పాలిటెక్నిక్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

పాడేరు రూరల్/ఎటపాక: పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలో ఇది వరకే చేరిన విద్యార్థులకు ఈనెల 12న ఇంటర్నల్ స్లయిడింగ్ జరిపి, 13న మిగులు సీట్ల భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం వర్తించదని ఆమె తెలిపారు. ఎటపాక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, స్పాట్ అడ్మిషన్ల ద్వారా వీటిని భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ జె.రామసత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది మొదటి సారిగా బాలికలకు(కోఎడ్యుకేషన్)కూడా అడ్మిషన్లు ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. వివరాలకు 9912342067,9848924184, 9440760060 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

అల్లూరి డీఎంహెచ్‌వోగా జమల్‌పాషా

సాక్షి, పాడేరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ సి.జమల్ పాషాను ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ సుజాత బాధ్యతల నుంచి రిలీవ్‌కానున్నారు. ఆమె విశాఖపట్నంలోని రిజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. నాలుగు నెలలుగా డాక్టర్ సుజాత డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు ఆమె కృషి చేశారు.

న్యూస్‌రీల్

మహేశ్వరరావుకు డీఎంహెచ్‌వోగా ప్రమోషన్



చింతపల్లి రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.మహేశ్వరరావుకు పశ్చిమగోదావరి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో)గా పదోన్నతి కల్పిస్తూ ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ డి.మహేశ్వరరావు డిప్యూటీ సివిల్ సర్జన్ క్యాడర్‌లో ఐదేళ్లుగా చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజా పదోన్నతుల్లో సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ డీఎంహెచ్‌వోగా పదోన్నతి రావడంతో సంతోషంగా ఉందన్నారు.

భూసర్వే వేగవంతం : జేసీ



పోతంగి పంచాయతీలో భూసర్వే వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివ శ్రీనివాస్

డుంబ్రిగుడ: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో భూ సర్వేను వేగవంతం చేయాలని జేసీ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని పోతంగి పంచాయతీ నందివలస,కొర్రా పంచాయతీ దొండలివలస గ్రామాలను ఆయన సోమవారం సందర్శించారు. భూ సర్వే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న భూ హక్కు భూరక్ష పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ముజిబ్, ఆర్ఐ హరి, వీఆర్వోలు జాన్సీ,రవి తదితరులు పాల్గొన్నారు.

సెలవులో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కు ఇన్‌చార్జి పీవో బాధ్యతలు

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ 15 రోజుల పాటు సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జి పీవోగా పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు అభిషేక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సతీమణి ఇటీవల బాబుకు జన్మనిచ్చారు. దీంతో రెండు వారాల పాటు పీవో సెలవు తీసుకున్నారు. ఈనెల 25న విధుల్లో చేరనున్నట్టు పీవో గోపాలకృష్ణ విలేకరులకు తెలిపారు.

ఫుడ్‌సైన్స్ టెక్నాలజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ ఏడాది నుంచి నూతనంగా ప్రారంభిస్తున్న ఫుడ్ సైన్స్ టెక్నాలజీ సమీకృత కోర్సులో మిగుల సీట్లు స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు తెలిపారు. ఐదేళ్ల కాల వ్యవధితో నిర్వహించే ఈ కోర్సులో మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ ఆప్షన్ ఉంటుందన్నారు. కోర్సులో మొత్తం సీట్లు 40 కాగా.. ఫీజుగా ఏడాదికి రూ. 65 వేలు చెల్లించాలన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 50 శాతం మార్కులు సాధించిన వారు కోర్సులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు 0891 2573441 నెంబర్‌లో గానీ www.audoa.in వెబ్‌సైట్ నుంచి గానీ పొందవచ్చన్నారు. కోర్సులో భాగంగా మొదటి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, రెండేళ్లు పూర్తిచేసిన వారికి డిప్లమా, మూడేళ్లు పూర్తిచేసిన వారికి డిగ్రీ, నాలుగేళ్లు పూర్తిచేసే వారికి హానర్స్ డిగ్రీ, ఐదేళ్లు పూర్తిచేసిన వారికి పీజీ డిగ్రీ అందించనున్నట్లు తెలిపారు.

గర్జనతో సత్తా చాటుదాం..

- అమరావతి రైతులది రాజకీయ యాత్ర
- త్యాగం అంటే వంశధార, తోటపల్లి రైతులది...
- వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి
- మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి బూడి మూత్యాలనాయుడు, మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 15న నిర్వహించనున్న విశాఖ గర్జన విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. అమరావతి రైతులు చేస్తోంది పాదయాత్ర కాదని, రాజకీయ యాత్ర అని పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లడుతూ అమరావతి రైతులది త్యాగం ఎలా అవుతుందని ప్రశ్నించారు. త్యాగం అంటే వంశధార, తోటపల్లి ప్రాజెక్టు రైతులదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతోందన్నారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడైనా అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరగాలన్నదే సీఎం ఆలోచన అన్నారు. 15న జరగనున్న విశాఖ గర్జనతో మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించే రీతిలో అనేక మంది కళాకారులు పాల్గొంటారన్నారు. రాజధానిగా విశాఖను తెలుగుదేశం పార్టీ నేతలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని మంత్రులు డిమాండ్ చేశారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించామని, విశాఖ గర్జనలో అందరూ భాగస్వామ్యులయ్యేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మంగళవారం జగదాంబ నుంచి పాత పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఈనెల 15న జరిగే కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వికేంద్రీకరణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎమ్మెల్సీలు పి.రవీంద్రబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణిలు మాట్లాడుతూ విశాఖకు పరిపాలన రాజధాని కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. జనసేన నేత పవన్ కళ్యాణ్ ఉత్తరాంధ్ర దోహి అని విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రి పి.బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పంచకర్ల రమేష్‌బాబు, ఎస్.ఎ.రెహ్మాన్, తిప్పల గురుమూర్తిరెడ్డి, పార్టీ నాయకులు కోలా గురువులు, అక్కరమాని వెంకటరావు, చొక్కాకుల వెంకటరావు, జాన్ వెస్లీ, రవిరెడ్డి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కంపా హనోక్ తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణపై కౌన్సిల్‌లో తీర్మానం

నవంబర్ 4న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మూడు రాజధానులకు మద్దతుగా తీర్మానం ఆమోదిస్తామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. వికేంద్రీకరణ వల్ల రాష్ట్రంతో పాటు విశాఖ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్రలో వలసలను ఆపాలనే విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు.

జిల్లా ఖజానాధికారిగా ప్రసాద్‌బాబు బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ సుమిత్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రసాద్‌బాబు

సాక్షి,పాడేరు: జిల్లా ఖజానాధికారిగా ప్రసాద్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గొల్లపూడిలోని ఏపీవీవీపీ కమిషనర్ కార్యాలయంలో సహాయ ఆర్థిక అధికారిగా పనిచేస్తున్న ప్రసాద్ బాబుకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఖజానా అధికారిగా నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రసాద్‌బాబుకు చింతపల్లి, పాడేరు, అరకులోయ ఉప ఖజానా అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఇంత వరకు ఇన్‌చార్జి జిల్లా ఖజానా అధికారిగా పనిచేస్తున్న కె.సత్యనారాయణ తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు.

విశాఖ గర్జనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు : పరిపాలనా వికేంద్రీకరణకు మద్దతుగా ఈనెల 15న ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న విశాఖ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వికేంద్రీకరణతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో వికేంద్రీకరణకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని, దేశంలోని పలు రాష్ట్రాల సీఎంలు కూడా తమ రాష్ట్రాల్లో అదనపు రాజధానుల ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నారని ఆమె తెలిపారు. ఇప్పటికే నవరత్నాలు పథకాలతో పేదలకు లబ్ధి చేకూర్చారని, నాడు-నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించారని చెప్పారు. ఆ పథకాల అమలుపై దేశ వ్యాప్తంగా ప్రజలు, నాయకులు ప్రశంసలు, అభినందనలు తెలుపుతున్నారన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా ఆదివారం పాడేరులో నిర్వహించిన అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పరిపాలన రాజధానిగా విశాఖ కావాలని కోరుకుంటున్నారని, గిరిజన మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తకులు వికేంద్రీకరణకు మద్దతునివ్వడం మంచి పరిణామమన్నారు. ఈ నెల 15న జరిగే విశాఖ గర్జన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

'స్పందన' సమస్యలకు తక్షణ పరిష్కారం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్పందన కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఐటీడీఏ పరిపాలనాధికారి వి.రమణతో కలిసి పీవో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజల నుంచి 70 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు. కొన్నింటిని వెంటనే పరిష్కరించి, మరికొన్ని దరఖాస్తులను పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులకు పంపినట్టు తెలిపారు. మారేడుమిల్లి మండలం కుట్రవాడ పంచాయతీ కాకూరు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ సార్ల రమాదేవి, సార్ల మంగిరెడ్డి, పండు రెడ్డి అర్జీ అందజేశారు. కొండ మొదలు పంచాయతీకి చెందిన 40 మందికి పెద్ద భీమ్‌పల్లిలో ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, దేవీపట్నం మండలం శరభవరం గ్రామ గిరిజనులకు కొండపోడు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి.డేవిడ్ రాజు, ఎండీ యూసఫ్, ఏపీడీ వెలుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు



భూముల సర్వే పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 3,277 గ్రామాల్లో భూముల రీ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సర్వే బృందాలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో భూముల రీసర్వే ఏజెన్సీలతో ఆయన సమీక్షించారు. సర్వేకు సంబంధించిన డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్)పరికరాలను ఆయన పరిశీలించారు. నెట్‌వర్క్ లేని ప్రాంతాలలో భూ సర్వేకు ఈ పరికరాలు ఉపయోగపడతాయని సర్వే బృందాలు కలెక్టర్‌కు తెలిపాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడేరు డివిజన్‌లో 2,969,రంపచోడవరం డివిజన్‌లో 308 గ్రామాల్లో భూముల రీసర్వే చేపడుతున్నామన్నారు. పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో జియోకాన్ సర్వే సంస్థ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో సిల్వర్ లైన్ టెక్నో సొల్యూషన్ సంస్థ, చింతపల్లి, జి.మాడుగుల, జి.కె.వీధి మండలాల్లో ఎంఆర్‌కే జియోమాటిక్స్ సంస్థ, అనంతగిరి, అరకులోయ, కొయ్యూరు మండలాల్లో ప్లానెట్ జియోటిక్ సంస్థ, రంపచోడవరం డివిజన్ పరిధిలో అడ్డతీగల,గంగవరం,మారేడుమిల్లి, రాజవొమ్మంగి,రంపచోడవరం మండలాల్లో నవీన్ సర్వే మరియు కన్‌స్ట్రక్షన్స్ సంస్థ భూముల రీసర్వే చేపడతాయన్నారు.సర్వే సంస్థలకు మండల సర్వేయర్లు,పంచాయతీ కార్యదర్శులు,వీఆర్‌వోలు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే విభాగం సహాయ సంచాలకులు వై.మోహనరావు, జియోకాన్,నవీన్ సర్వే సంస్థల ప్రతినిధులు పి.కృష్ణప్రసాద్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

మనబడి నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. అరకు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న నాడు-నేడు పనుల ప్రగతిపై సోమవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట వంద బస్తాల సిమెంట్ కొనుగోలు చేసుకునేందుకు అనుమతిస్తామని, మన బడి నాడు-నేడుపనులను సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. 764 పాఠశాలలకు ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేసిందని, అధికారులు ఆయా పనులను పర్యవేక్షించి నిర్మాణ పనుల వివరాలు, ఖర్చులను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇవో డాక్టర్ పి.రమేష్, గిరిజన సంక్షేమ అరకు ఈఈ కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక

సాక్షి,పాడేరు : ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులంతా ఇసుకను ఉచితంగా పొందవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం తెలిపారు. జిల్లాకు 14,613 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గృహ నిర్మాణశాఖ పర్యవేక్షణలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలకు దగ్గరలోని వాగులు, సెలయేరులు, గెడ్డలు, పెద్ద కాల్వలు వంటి మూడవ స్థాయి నీటి ప్రవాహాల నుంచి ఇసుకను ఉచితంగా సేకరించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇసుక రవాణాకు ట్రాక్టర్, ట్రాలీ, తోపుడు బండి, ఎడ్ల బండి వినియోగించుకోవచ్చని, ఇసుక రవాణా సమయంలో మాత్రం గృహ మంజూరు పత్రం తప్పనిసరిగా వెంట ఉంచుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల ఇసుక రవాణాకు సంబంధించి స్థానిక రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, గ్రామ సచివాలయాలు, మైనింగ్ శాఖల అధికారులు ఎలాంటి ఇబ్బందులకూ గురి చేయవద్దని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

జోరుగా వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

సాక్షి,పాడేరు/అడ్డతీగల: జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్‌రోడ్డులో ఈదురుగాలులతో వర్షం కురుస్తుండడంతో వాహన చోదకులను భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన కురుస్తూనే ఉంది. ప్రధాన వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో గెడ్డల ఉధృతి కారణంగా ఆవల గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డతీగల-ఏలేశ్వరం ప్రధాన రహదారికి అడ్డంగా రెండు చోట్ల చెట్లు కూలిపోయాయి. అడ్డతీగల మండలం తిమ్మాపురం వద్ద రహదారికి అడ్డంగా, అడ్డతీగలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై చెట్లు కూలాయి. దీంతో ఈ రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కళాశాల సమీపంలో కూలిన చెట్టును అడ్డతీగల ఉపసర్పంచ్ ముప్పనశెట్టి శ్రీనివాసరావు పొక్లెయిన్ సాయంతో తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. జిల్లా వ్యాప్తంగా 177.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేవీపట్నంలో 23.8, గంగవరంలో 21, అడ్డతీగలలో 18, వీఆర్‌పురంలో 15.6, కూనవరంలో 14.4, పాడేరులో 13.2, వై.రామవరంలో 12.6, రంపచోడవరంలో 8.8, రాజవొమ్మంగిలో 7.2, అరకులోయలో 5.4, పెదబయలులో 5.6, చింతపల్లిలో 4.8, కొయ్యూరులో 6.4, మారేడుమిల్లిలో 5.4, డుంబ్రిగుడలో 2.6, జి.మాడుగులలో 4.6, జీకే వీధిలో 2.6, హుకుంపేటలో 2, ఎటపాకలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



రహదారికి అడ్డంగా కూలిన చెట్టును పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

సమాచార వ్యవస్థ మెరుగుకు కృషి

- స్వేచ్ఛ ఎగ్జిక్యూటివ్ ఆర్గనైజర్ శ్రీపథ్



భీమవరం పాఠశాల వద్ద ఫ్రీడం బాక్సు ఏర్పాటు చేసిన స్వేచ్ఛ సంస్థ ప్రతినిధులు

రాజవొమ్మంగి: మన్యంలోని మారుమూల గ్రామాల్లో సెల్ సిగ్నల్స్, ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తూ సమాచార వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఏపీ.స్వేచ్ఛ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆర్గనైజర్ శ్రీపథ్ తెలిపారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ భీమవరంలో 70 కుటుంబాలకు ఫ్రీడం బాక్స్‌ల సాయంతో ఉచిత ఇంటర్నెట్, సెల్‌సేవలను సోమవారం అందుబాటులోకి తెచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామంలో రెండు రోజుల కిందట సుమారు 150 కుటుంబాలకు ఇంటర్నెట్ సెల్ సిగ్నల్స్‌ను అందజేశామన్నారు. కేఎల్‌యూ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల సాయంతో ఫ్రీడం బాక్స్ రూపొందించినట్టు తెలిపారు. ఈ బాక్స్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయాన్ని స్వేచ్ఛ అనే పాస్‌వర్డ్ ఉపయోగించి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ నాగదుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుగొండ ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా

- ఒకరి మృతి, 15 మందికి గాయాలు



బంగారు నాయుడు మృతదేహం

పాడేరు రూరల్ : ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, 15 మందికి గాయాలయ్యాయి. పెదబయలు మండలం కుంతుర్ల గ్రామానికి చెందిన 17 మంది గిరిజనులు తమ వ్యక్తిగత పనుల నిమిత్తం సర్వీసు ఆటోలో పాడేరు వచ్చేందుకు సోమవారం బయలుదేరారు. వర్షాల కారణంగా పాడేరు మండలం కించూరు పంచాయతీ ఉరుగొండ ఘాట్ రోడ్డు బురదమయంగా మారడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కుంతుర్ల గ్రామానికి చెందిన బంగారు నాయుడు(33) అనే గిరిజనుడికి తీవ్ర గాయాలు కాగా, మరో 15 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బంగారు నాయుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. స్వల్పంగా గాయపడిన వారు ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం బంగారు నాయుడు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గిరిజన యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్

సీలేరు: గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని, ఇందులో భాగంగా ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చింతపల్లి ఏఎస్పీ కొమ్ము ప్రశాంత్ శివకిషోర్ తెలిపారు. ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆయన సీలేరు పోలీసు స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గిరిజన యువతీ యువకులు చదువుకున్నప్పటికీ ఉద్యోగావకాశాలు లేకపోడం బాధగా ఉందన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాల కోసం 55 మంది గిరిజన బాలికలను ఎంపిక చేశానని, వారు త్వరలో ఉద్యోగాల్లో చేరతారన్నారు. దేశంలోనే జిల్లాకు పర్యాటకంగా మంచి గుర్తింపు ఉందని, టూరిజం ఆధారంగా గిరిజన యువత ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, పోలీసులు నిర్వహిస్తున్న ప్రేరణ తదితర కార్యక్రమాల వల్ల చింతపల్లి డివిజన్‌లో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గిందని చెప్పారు. మావోయిస్టులను గిరిజనులను నమ్మడం లేదన్నారు. గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విశాఖ డిపో నుంచి సీలేరు మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారని, దీనిపై ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడుతానని తెలిపారు. గిరిజనులకు ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. సీలేరు,దారకొండ వారపు సంతలను ఆయన సందర్శించారు. సంతల్లో విక్రయిస్తున్న నకిలీ వస్తువులను గుర్తించి, అలాంటి వాటిని ఇకపై విక్రయిస్తే చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట జీకేవీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

46 మంది ఎంపిక



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

రంపచోడవరం: టాటా టెక్నాలజీ సంస్థలో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాల కోసం 46 మందిని ఎంపిక చేసినట్టు రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రేరణ కార్యక్రమం ద్వారా రంపచోడవరంలో నిరుద్యోగ మహిళల కోసం జాబ్ మేళా నిర్వహించినట్టు చెప్పారు. ఈ జాబ్ మేళాకు చింతూరు, రంపచోడవరం పరిధిలో 87 మంది మహిళలు హాజరు కాగా 46 మంది ఎంపికైనట్టు చెప్పారు. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం తమిళనాడు రాష్ట్రం హోసూరు పట్టణంలో టాటా టెక్నాలజీస్ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఈ నెల 12 పాడేరులో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, రంపచోడవరం, దేవీపట్నం ఎస్ఐ మోహన్ కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వారపు సంతలో సీఆర్పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 145 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేసినట్టు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన లారీ: స్తంభించిన ట్రాఫిక్



అనంతగిరి: ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ ఘాట్‌రోడ్డులోని హెయిర్‌పిన్‌బెండ్- 5 మలుపు వద్ద సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. పెద్ద వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి.

- సర్వాంగ సుందరంగా చెత్త సంపద కేంద్రాలు
- గ్రామ పంచాయతీలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

చెత్తతో సంపద.. పల్లె అభివృద్ధికి అండ



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాడేరు డీఎల్‌పీవో కుమార్



అనంతగిరి మండల కేంద్రంలో వినియోగంలో ఉన్న చెత్త సంపద కేంద్రం

అనంతగిరి: రోజురోజుకు నూతన విధానాలతో సరికొత్త ఆలోచనలతో ప్రభుత్వం ముందుకు దూసుకుపోతోంది. సంపద కేంద్రాలు వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో చెత్త సంపద కేంద్రాలను గాలికి వదిలేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెత్త సంపద కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటమే కాకుండా గ్రామ పంచాయతీలు ఆర్థికంగా పొందేందుకు ప్రత్యేక ప్రణాళికలను రుపొందించింది. ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి, ఆ దిశగా అడుగులు ముందుకు వేసింది.

పంచాయతీలకు ఆదాయం

చెత్త నుంచి సంపద తయారీ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుంది. ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కల్పించుకోవచ్చు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువులను తయారుచేసి, ఎరువులను రైతులకు తక్కువ ధరకు అందించి, పంచాయతీల ఆర్థిక బలోపేతం దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది .

అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

అల్లూరి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డివిజినల్ పంచాయతీ అధికారులు వారానికి రెండు యూనిట్లు పరిశీలించి, వినియోగంకి తెచ్చేందుకు కృషి చేయాలి. ఎంపీడీవో, ఈవోపీఆర్డీలు వారానికి మూడు చొప్పున పరిశీలించి, ప్రస్తుత పరిస్థితిపై యాప్‌లోని ఫోటోలు పొందుపరచాలి. దీంతో పాటుగా వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలి. చెత్త సంపద కేంద్రాల వద్ద నిర్వహణపై అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. పారిశుధ్యం, చెత్త సంపద కేంద్రాలపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలకు ఎన్ఆర్ఈజీఎస్‌లోని అప్రోచ్ రోడ్లు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో సంపద కేంద్రాలు రూపురేఖాలు మారుతున్నాయి.

సేంద్రియ ఎరువులు వాడకంతో లాభాలు

సేంద్రియ ఎరువులను వాడటంతో ఎన్నో లాభాలు ఉన్నాయంటూ అధికారులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సూక్ష్మ పోషక పదార్థాల నిష్పత్తి మారుతుందంటున్నారు. భూసారం తగ్గకపోవడంతో పంటల దిగుబడులు పెరుగుతాయని చెబుతున్నారు.

పాడేరు డివిజన్‌లో చెత్త సంపద కేంద్రాల వివరాలు:

11 మండలాల్లో 244 పంచాయతీల్లో

సంపద కేంద్రాలు మంజూరైనవి	: 223
వినియోగంలో ఉన్నవి	: 85
పనులు జరుగుతున్నవి	: 81
ప్రారంభించాల్సి ఉన్నవి	: 57

పంచాయతీల అభివృద్ధికి దోహదం

పంచాయతీల అభివృద్ధికి చెత్త సంపద కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి. కేంద్రాల్లో తయారైన సేంద్రియ ఎరువులను స్థానిక గిరిజన రైతులు వినియోగించుకుని, గ్రామ పంచాయతీకి అభివృద్ధికి సహకారం అందించాలి. నిర్మాణంలో ఉన్న సంపద కేంద్రాలను వినియోగం తెచ్చుందుకు కృషిచేస్తున్నాం. సంపద కేంద్రాల్లో కల్పించాల్సి సదుపాయలపై పరిశీలిస్తున్నాం.

– కుమార్, డీఎల్‌పీవో, పాడేరు

భారత్-దక్షిణ కొరియా మధ్య మరింత సహకారం



కమిటీ ప్రతినిధులతో ఎంపీ మాధవి

- విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: రిపబ్లిక్ ఆఫ్ సౌత్ కొరియా, భారత్ మధ్య సంబంధాలు చాలా దృఢంగా ఉన్నాయని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. రెండు దేశాల మధ్య అనేక అంశాలపై ఒప్పందాలు కొనసాగుతున్నట్టు తెలిపారు. సోమవారం ఢిల్లీలో జరిగిన విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కొరియా పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో కమిటీ అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో సభ్యురాలిగా ఉన్న మాధవి పాల్గొని మాట్లాడారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడి, సాంకేతిక రంగంలో పరస్పరం సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలని అభిలషించారు. సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై ఎక్కువ సేపు చర్చ జరిగిందన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల్లో భారత్‌తో మరింత మెరుగైన సంబంధాలు ఏర్పరచుకునేందుకు కొరియా పార్లమెంటరీ బృందం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. ఈ సమావేశంలో సౌత్ కొరియా జాతీయ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కిమ్‌యంగ్‌జోతో పాటు ఆ దేశ ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



దుడుమ జలపాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: అరుకు నియోజకవర్గం పరిధిలో ఉన్న సుందర ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని రాప పంచాయతీ మంగళిమాడిలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ‘మన్యంలో మరో జలపాతం’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ మేరకు మంగళిమామిడి గ్రామ సమీపంలో నూతనంగా వెలుగులో వచ్చిన దుడుమ జలపాతానికి ఆయన సందర్శించారు. జలపాతం సుందర దృశ్యాలను చూసి ఆకర్షితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. దీంతో పాటు మండలం పరిధిలోని సరసుపాడు జలపాతం, గొడుగురాయి, గుడ్డిగుమ్మి జలపాతాలతో పాటు ఏజెన్సీలో అత్యంత ఎత్తైన సీతమ్మ పర్వతం(జెండా కొండ), ఉప్ప చెట్లు తదితర సందర్శిక ప్రదేశాలను పర్యటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు నాగలక్ష్మి, నాయకులు దర్మయ్యదొర, మహేష్, శామ్యూల్, సుబ్బు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతూరు: పోలవరం ముంపు మండలాల్లో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, చదలవాడ ఉప సర్పంచ్ విప్లవ్‌కుమార్ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. వీఆర్ పురం మండలంలో అన్నవరం వాగుపై వంతెన కూలిపోవడంతో రవాణా వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడతున్నారని, తాత్కాలికంగా రహదారి నిర్మించాలని కోరారు. తులసిపాక నుంచి వీఆర్ పురం మండలం కుందులూరు వరకు, చట్టిలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక నుంచి సింగన్నగూడెం వరకు రహదారుల కోసం విన్నవించారు. అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయిన పేగ-మల్లంపేట, కొత్తపల్లి-వేములరాయి, ఏడుగురాళ్లపల్లి-తాటిలంక, కుయిగూరు-తాపరపేట, వేగితోట-కన్నాయిగూడెం, కొల్తూరు రహదారుల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, నాలుగు మండలాల్లో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి



జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ దక్షిణ): అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఒకటి నుంచి 7వ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, నిర్మాణ పనులకు సంబంధించి వారివారి మండలాల్లో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు అందడం లేదని దానికి గల కారణాలను విశ్లేషించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు సూచించారు. జగనన్న కాలనీలకు గతంలో డబ్బులు కట్టిన వారికి రీయింబర్స్‌మెంట్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఆకస్మిక దాడులు

- 900 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న బెల్లపు ఊటతో సిబ్బంది

రంపచోడవరం : జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఏఎస్పీ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం సెబ్ స్టేషన్ సిబ్బంది, దేవీపట్నం పోలీసులు ఆధ్వర్యంలో దేవీపట్నం మండలం చిన్న భీంపల్లి గ్రామంలో నాటుసారా బట్టీలపై సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉంచిన 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్టు రంపచోడవరం సెబ్ సీఐ అనంద్ తెలిపారు. విశాఖపట్నం సెబ్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం రంపచోడవరం సెబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 87 కేసుల్లో పట్టుబడిన 1140 లీటర్ల నాటు సారాని, మూడు కేసుల్లో పట్టుబడిన 80 కేజీల నల్లబెల్లంను ఇన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి రాజు, మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేయడం జరిగిందని సీఐ తెలిపారు. సారా దాడుల్లో పట్టుబడిన రెండు బైకులను బహిరంగ వేలం వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ ఫణీంద్ర కుమార్, అనిత రాజ్‌కుమార్, సత్యనారాయణ, రమణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బైకు-ఆర్టీసీ బస్సు ఢీ : వ్యక్తి మృతి





బస్సు ముందు భాగంలో చిక్కుకున్న బైకు , మృతి చెందిన దుర్గ(ఫైల్)

మావరపాలెం : బైకు, ఆర్టీసీ బస్సు ఢీకొట్టుకుని ఒక వ్యక్తి మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన లాలం దుర్గ(35) తన అత్తగారి గ్రామమైన మండలంలోని రామన్నపాలెం శివారు వెంకయ్యపాలెం దసరా పండగకు వచ్చాడు. సోమవారం మోటార్‌సైకిల్‌పై పిఠాపురానికి బయలుదేరాడు. కొండలఅగ్రహారం సర్పానది వంతెన మలుపు వద్దకు వెళ్లేసరికి నర్సీపట్నం నుంచి విశాఖ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన దుర్గను వెంటనే 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న దుర్గను మృత్యువు బలితీసుకోవడంతో భార్య గంగాభవానీ, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

అమ్మో...ఇంకొంచెం జారి ఉంటే...!



లోయ అంచున ఆగిన కారు

పాడేరు రూరల్ : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి హిల్స్ అందాలను తిలకించేందుకు వెళ్తున్న పర్యాటకుల కారు ప్రమాదానికి గురైనప్పటికీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విశాఖపట్నానికి చెందిన పలువురు పర్యాటకులు సోమవారం ఉదయం కారులో వంజంగి వెళ్తున్నప్పుడు ఈ మార్గంలోని సంపంగి గరువు గ్రామం సమీపంలో చిన్న గుప్ప ఎక్కించే క్రమంగా ఒక్కసారిగా వెనక్కి వచ్చేసింది. వెనుక వైపు చక్రాలు రెండు లోయ అంచుకు పూర్తిగా దిగిపోయాయి. కానీ డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కారును ఆపగలిగాడు. దీంతో వెంటనే కారులో ఉన్న వారంతా బయటకు వచ్చారు. ఏ చిన్న తప్పిదం జరిగిన కారు లోయలోకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



ముఖంపై తీవ్ర గాయాలతో సుధాకర్

ముంచంగిపుట్టు : మండలంలోని వనభసింగి పంచాయతీ లుంగాపుట్టు గ్రామ సమీపంలోని మలుపు వద్ద సోమవారం సాయంత్రం బైకు అదుపు తప్పి ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రానికి చెందిన గడుతుల సుధాకర్, భగత్ రామ్ సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రానికి వచ్చి పనులు ముగించుకొని సాయంత్రం గ్రామానికి బైకుపై వెళ్లుండగా లుంగాపుట్టు మలుపు వద్ద బైకు అదుపు తప్పి రహదారి పక్క ఉన్న లోయలోకి దూసుకుపోయింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గాయాల నుంచి రక్త స్రావం జరుగుతుండడంతో స్పృహ కోల్పోయారు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే వారిని ప్రైవేట్ వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. స్టాఫ్ నర్స్ శ్రీదేవి,వైద్య సిబ్బంది వంశీ, లింగన్నలు వైద్య సేవలను అందించారు. ఇద్దరి పరిస్థితి మెరుగ్గా ఉండడంతో డిశ్చార్జ్ చేశారు.

లారీలో 375 కిలోల గంజాయి : ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి : మారేడుమిల్లి మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలు ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన లహరి రామ్ యాదవ్, అభమ్‌రాజ్ యాదవ్ అనే ఇద్దరు వ్యక్తులు టెన్ టైర్ లారీలో గంజాయిని ఉత్తర ప్రదేశ్‌కు తరలిస్తుండగా స్థానిక గుజ్జిమామిడి వలస జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 375 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, లారీని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

గడ్డి మందు తాగిన మహిళ మృతి

గంగవరం : పీడ కలలు వస్తున్నాయంటూ మానసిక వేదనకు గురై గడ్డిమందు సేవించిన మహిళ మృతి చెందిన సంఘటన గంగవరం మండలం మొల్లేరు గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ రజాక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొల్లేరుకు చెందిన కమ్మర రామాయమ్మ (46) కొంత కాలంగా నిద్రలో పీడకలలు వస్తున్నాయంటూ తీవ్ర మానసిక వేదనకు గురవుతుందని, ఈ నేపథ్యంలో గత నెల 24వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటిలో ఉన్న గడ్డి మందును సేవించింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు పిడతమామిడి పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేసి రాజమండ్రి తరలించారు. అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమేరకు మృతురాలి భర్త పెద్దరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏఎస్ఐ రజాక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : విద్యుత్ షాక్‌కు గురైన కారణంగా ఓ వ్యక్తి సోమవారం మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పూల్‌బాగ్ రోడ్డులో నివాసముంటున్న వైద్యనాథం శివ రోజూ మాదిరిగానే అదే ప్రాంతంలో చెగోడిల కంపెనీలో పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైనట్టు ఎస్ఐ చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■A.P పారామెడికల్ డిప్లొమా కోర్సులకు DMLT, DIMT, DOA, DMSM & OT, DMPHA (Male) అడ్మిషన్ కొరకు మదర్ థెరిస్సా, చోడవరం. ఫోన్ : 80195 12349 [V-791904]

Real Estate

FLAT FOR SALE

■Luxury Flat for sale in Meghana Royal towers, Chinna waltair, near Kurupam circle. Call : 8977906699 for details. [WB-33256]

HOUSE FOR SALE

■House for sale 565 Sq.yds 10,000 Sft Madhavadhara VUDA Colony, A to Z Real Estate Consultancy. Ph : 95421 56666 [V- 3349]

LAND FOR SALE

■R తాళ్ళవలస పెట్రోల్ బంకు ఎదురుగా దొరతోట వెళ్ళే తారు రోడ్డుకి అనుకొని కమర్షియల్ స్థలం 1000 గ॥ 400గ॥ E.F., Rs.30 వేలు గ॥. సంప్ర: 9989533457 [P-1222403]

PLOT FOR SALE

■Rushikonda - Bheemili Beach Road, Chepaluppada (V), 200, 300 Sq.yds. Plots No IT Sez, Ins Kalinga Ramanaidu Studio, GITAM College. Ph : 88229 09999 [V- 2264]

■HYD to ముంబై హైవే రోడ్ సదాశివపేట, వికారాబాద్ మెయిన్‌రోడ్ ఫేసింగ్స్ 128+12 ఎకరాలు, DTCP ప్లాట్లు కలవు. 10 Lakhs ఇన్వెస్ట్‌మెంట్ 30 వేలు రెంటల్స్ ప్రతి నెల. సెల్ : 96037 78555 [R-246]

Services

ASTROLOGY

■శ్రీ సమ్మక్క సారక్క దైవశక్తితో ఉచితంగా జ్యోతిష్యం చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, విద్య, ఉద్యోగం, వ్యాపారం, భార్య భర్తల గొడవలు, సంతానం, ఆరోగ్యం, నాగదోషం, స్త్రీ, పురుషుల వశీకరణం, అన్ని సమస్యలకు 100% ఫోన్‌లోనే పరిష్కారం. 9177077712 [G-700]

BUSINESS OFFER

■వెన్ట్రస్‌గ్లోబల్ ట్రేడర్స్ జీరో మార్కెట్ రిస్క్‌తో అత్యుత్తమ పెట్టుబడి ప్రణాళికలు ISO సర్టిఫైడ్ కంపెనీతో రోజువారి డబ్బు సంపాదించండి. ఫోన్ : 7288821115/1116. [HA-2742]

GOLD LOANS

■లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 980]

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర ✆ 70358 70359 [B-523]

SEPTIC TANK CLEAN

■(స్వచ్ఛభారత్ సెప్టిక్ క్లీన్) హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఎటువంటి దుర్వాసన, అసౌకర్యం లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 99883 39490, 91829 10245 [V-770450]

■శ్రీ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగు పొరుగు వారికి ఎటువంటి దుర్వాసన, అసౌకర్యం లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 93838 [V-1512]

Wanted

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్ ఫ్రీ బుక్‌లెట్ కొరకు సంప్ర : 9985782069. [A-3001]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి పార్ట్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 10,000- 15,000 వరకు సంపాదించే అవకాశం. ఫ్రీ బుక్‌లెట్ కొరకు. 9059509586 [G-782268]

■డైరెక్ట్ జాబ్స్ : ఆఫీస్ కొరకు రిసెప్షనిస్ట్, టెలీకాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్, డెలివరీ బాయ్స్, మేనేజర్, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం : 15k to 25k. ఫోన్ : 90304 27839 [V-791798]

■SBI లైఫ్‌లో అడ్వైజర్స్ / సేల్స్ మేనేజర్స్‌గా చేయుటకు M/F కావలెను. Qlf : 10th+ & Rtd. ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, హౌస్‌వైఫ్స్ PM. 15 - 30k. సంప్ర : 63029 77110 [V-1521]

■రుషికొండ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను మరియు ఎక్స్‌సర్వీస్ మెన్స్ కూడా కావలెను. PF, ESI కలదు, మంచి జీతం కలదు. ఫోన్ : 72078 98535, 86860 31666 [V- 9739]

■ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వర్క్ చేయుటకు కార్గో సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, లోడర్స్ అర్జెంట్‌గా కావలెను. జీ: 18,000/- to 30,000/-, Q: 5th to Any Degree రూం+భోజనం ఫ్రీ. 9642264336 [H-778904]

■ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్ టైమ్ 1గం॥ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. 7702473949 [G-782252]

■హైదరాబాద్‌లోని అప్నా హోంకేర్‌లో పని చేయడానికి 21-45వయస్సు గల M/F కేర్ టేకర్స్ / అటెండర్లు కావలెను. జీతం: 16-18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. 6300813664 [G-1691]

■స్వయం ఉపాధి శిక్షణ తక్కువ పెట్టుబడితో ఇంటివద్దనే ఉంటు దీపారాధాన వత్తులు మరియు ప్యాకింగ్ చేస్తూ నెలకు 12వేలు నుంచి 25 వేలు ఉచిత ట్రైనింగ్ మరియు Cotton wicks mechines మరియు Raw మేటీరియల్ అమ్మబడును. ఫోన్ : 90304 27839, 90324 21867 [V-791793]

■ఫ్లాష్... ఫ్లాష్...Harisree Housing Pvt Ltd లో పనిచేయుటకు కోర్, MLM, రియల్ ఎస్టేట్ లీడర్స్, టెలికాలర్స్ కావలెను. 83674 65555. [T-8244]

■మీ ఇంటివద్దనే వుంటు మా కంపెని ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం:12000. ఫోన్: 8374272245 [G-105]

■ప్రహస్య బేబీకేర్ ఇంటి వద్ద ఉండి పిల్లలను, వృద్ధులను చూసుకోవడానికి, పనివారు కావలెను. జీతం: 15-20 వేలు, హైదరాబాద్. 9533909627, 9494071023 [H-784677]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K. ఏజెంట్స్ కమీషన్. 3K. Ph: 7569955551, 9848571888 [H-784903]

■స్వేత హోంకేర్ సర్వీస్ నందు పెద్ద వారికి సేవ చేయుటకు 24 Hr. ఇంటి, వంట పని, బేబీకేర్ టేకర్స్, అటెండర్ హెల్పర్స్, ఏజెంట్స్ స్త్రీ/పు కావలెను. జీ॥ 20-25 వేలు, ఫ్రీ రూం + మెస్ ఫ్రీ. సంప్ర॥ 8520900992, 9121722069 [Y-753127]

■వైజాగ్‌లోని Majestic B & R నందు పనిచేయుటకు అనుభవం గల Cooks, Stewards, Suppliers, Computer Operators కావలెను. PF, ESI కలదు. 9640556969, 8143917289 [G-111]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అద్దెకు / అమ్మకం / రియల్ ఎస్టేట్ / ఫర్నీచర్స్ / ఆటోమొబైల్స్ / కంప్యూటర్స్ / సర్వీసెస్ / కావలెను

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.325/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

వీధి లైట్లు అందజేత



వీధిలైట్లు అందజేస్తున్న సర్పంచ్ సొయిత తదితరులు

డుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు ప్రభుత్వం అందజేసిన వీధిలైట్లను సర్పంచ్ పి.సోయిత తదితరులు సోమవారం పంపిణీ చేశారు. సర్పంచ్ సొయిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వీధిలైట్లు వేయాలని, సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సచివాయ సిబ్బంది సద్దు, నంద, బలరాం, సంజీవ్, రత్నకుమారి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపే ధ్యేయం



ఓటరు నమోదు దరఖాస్తులు అందజేస్తున్న సర్పంచ్‌లు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ అన్నారు. జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో సర్పంచ్‌లు, నాయకులతో కలిసి గ్రామంలో పట్టభద్రులైన అభ్యర్థులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు దరఖాస్తులను అందజేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. సర్పంచ్‌లు నీలకంఠం, గంగాధర్, నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు కమల, నాయకులు జయదేవ్, తిరుపతి, అర్జున్, పద్మారావు, సోలెమాన్, భాగత్‌రామ్, పులిరాజు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల చేయూత



బాధితురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ నాయకులు తుపాను బాధితురాలికి అండగా నిలిచారు. భారీ వర్షాల కారణంగా ఆర్‌వీ నగర్‌కు చెందిన నెక్కుల సావిత్రి ఇల్లు ఆదివారం కూలిపోయింది. ఆమె నష్టపోవడవంతో వైఎస్సార్‌సీపీ నేత అంజీ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, కొంత నగదును అందజేశారు. రాజు, కొండబాబు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రంలోని శివారులో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులు పరిశీలించారు. రికార్డులు, లైసెన్స్‌లు లేనివారిపై కేసులు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం తనిఖీలు చేపట్టామన్నారు. సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు సిబ్బంది, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

నాడు-నేడు పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: లాగరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ద్వారా రూ.36 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, సర్పంచ్ గణలక్ష్మి తదితరులు సోమవారం భూమిపూజ చేశారు. మొల్లిమెట్లలో నాడు-నేడు ద్వారా రూ.16లక్షలతో చేపట్టనున్న పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు వెంకటరమణ, బాబ్జీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పనసలపాలెంలో గడప గడపకు

వై.రామవరం: పనసలపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కె.ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కె.వెంకటలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

- పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లోని గ్రామాల్లో 'గడప గడపకు'..
- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులపల్లి ధనలక్ష్మిలకు ఘన స్వాగతం



పనసపల్లిలో లబ్ధిదారుడికి ఇంటి పట్టాను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ, పార్టీ నేతలు



వెదురునగరంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గూడెంకొత్తవీధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గూడెం పంచాయతీ పరిధిలో పనసపల్లి, లంకపాకలు, సంపంగిగొంది, కొత్తపల్లి, సిల్లిగూడ, వి.గొందిపల్లి, డి.కొత్తూరు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని 520 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విద్య, వైద్యంతో పాటు అనేక రంగాల్లో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేయడం హర్షణీయమన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని స్పష్టం చేశారు. పనసపల్లి పర్యటనలో గ్రామంలోని షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. బ్లాక్‌బోర్డు, సుద్దముక్కలు కూడా అందుబాటులో లేకపోవంపై ఎమ్మెల్యే స్థానిక ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు పక్కా భవనం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను విన్నవించారు. దీనిపై ఆమె స్పందించి నాడు-నేడు ద్వారా పాఠశాల భవనం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు కోసం విన్నవించగా, దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, కాసులమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు దావూద్, ఎంపీడీవో ఉమామహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతరావు, ఏవో మదుసూధన్, ఎంఈవో చంద్రశేఖర్, ఏపీవో రామ్‌ప్రసాద్, ఈవో ఆర్‌డీ పాపారావు, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటరావు, బాలకృష్ణ,వైఎస్సార్‌సీపీ నాయకులు అంజి, తరుణ్,

సంక్షేమమే ధ్యేయంగా ప్రజల చెంతకే పాలన: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రాయపల్లి సచివాలయం పరిధిలోని వెదురునగరం, చిన్నవడిశక్ర గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని 180 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజాప్రతినిధులే గడప గడపకూ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. పార్టీలు, కుల, మతాలకతీతంగా అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, ఎంపీటీసీ సత్యనారాయణదొర, సర్పంచ్ విశ్వనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, అబ్బులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఊరేగింపు

మారేడుమిల్లి: దసరా ఉత్సవాలు పురస్కరించుకొని దుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వైభంగా జరిగింది. నృత్య ప్రదర్శనలు, బాణా సంచా కాల్పుల నడుమ ఊరేగింపు సాగింది. సోమిరెడ్డి పాలెం దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు, భక్తులు పాల్గొవాలని ఆలయ కమిటీ సభ్యుడు సత్యనారాయణ కోరారు.

గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

కొయ్యూరు: మండలంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మేరీరోజ్ సోమవారం తెలిపారు. శరభన్నపాలెం కస్టర్-6, అంతాడ, కంఠారంలో మూడు పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలన్నారు. 13న దరఖాస్తుల పరిశీలన, 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.15న ఎంపికై న వారికి జాయినింగ్ పత్రాలు అందజేస్తామన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

డుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ దేముడువలస గ్రామంలో జియో టవర్ ఏర్పాటుకు సంస్థ ప్రతినిధులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. స్థలం పరిశీలనలో జియో సంస్థ సాంకేతిక సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అశోక్, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే ముంపు గ్రామాల్లో గృహ సర్వే



మాట్లాడుతున్న నాయకుడు గంగులు

వీఆర్ పురం: పోలవరం ముంపు గ్రామాలైన రాజుపేటకాలనీ , రేఖపల్లి గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ గృహ సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారని ఇది ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కృషి ఫలితమేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు అన్నారు. రేఖపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద ముంపుకు గురవుతున్న రాజుపేట కాలనీ,రేఖపల్లి,వీఆర్‌పురం బీసీకాలనీలో ఆర్‌అండ్‌ఆర్ సర్వే చేపట్టి ప్యాకేజీ ఇప్పించాలని ఎమ్మెల్యే దృష్టి తీసుకువెళ్లడంతో ఆమె దీనిపై స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్వే ప్రక్రియ వేగవంతమయ్యేలా చేశారన్నారు. అన్ని ప్రాంతాల్లో సర్వే జరుగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్‌మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, ఎంపీటీసీ సభ్యురాలు విజయ్యలక్ష్మి, సర్పంచ్ రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, గౌతమ్, వెంకటరమణ, వెంగళరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు

రంపచోడవరం: వరల్డ్ మెంటల్ హెల్త్‌డే సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.కల్పన ఆధ్వర్యంలో అందరికి అందుబాటులో మానసిక ఆరోగ్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రామారెడ్డి హాజరయ్యారు. మానసిక ఒత్తిడిని అధిగమించడం, నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సాధారణ సమస్యల గుర్తింపు, నివారణ చర్యలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి నెల 29, 30 తేదీల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటామని డాక్టర్ రామారెడ్డి తెలిపారు.

ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ



కొయ్యూరులో కిట్లను పంపిణీ చేస్తున్న సీడీపీవో విజయకుమారి



పెదబయలులో ప్రీ స్కూల్ కిట్లను పరిశీలిస్తున్న సీడీపీవో రాజ్యలక్ష్మీ

పెదబయలు: పెదబయలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీ స్కూల్ కిట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని సీడీపీవో రాజ్యలక్ష్మీ చెప్పారు. ఆమె స్టాక్‌ను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ చిన్నారుల కోసం 19 రకాల బోధన పరికరాలతో కూడిన కిట్‌లను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కిట్లు ఎంతగానో ఉపయోపడతాయన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతుల మీదుగా త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ వర్కర్లతో సీడీపీవో విజయకుమారి సోమవారం సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ రహదారి సౌకర్యం ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా సరకులు సరఫరా అవుతాయని, రవాణా సదుపాయం లేని సెంటర్లకు మునపటి మాదిరిగా స్టాకు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. సరకులు కేంద్రానికి చేరిన తరువాత వర్కర్లు వేలిముద్రలు వేయాలని సూచించారు. కేంద్రాల్లో రోజూ పిల్లలకు భోజనం అందజేస్తున్న ఫొటోలను విధిగా యాప్‌లో పంపాలన్నారు. అనంతరం ఐసీడీసీ ప్రాజెక్టు పరిధిలో 160 కేంద్రాలకు ప్రభుత్వం అందించిన ప్రీ స్కూల్ కిట్‌లను పంపిణీ చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, డ్వాక్రాసంఘాల మహిళలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న జెడ్‌పీటీసీ, వైస్‌ఎంపీపీ

రాజవొమ్మంగి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం నిర్వ హిం చిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు పొదుపు సంఘాల సభ్యులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య లీడర్లు, వీఓఏలు తయారుచేసిన క్షీరాన్నం, చక్కెర పొంగలి, రాగి సున్నుండలు, నువ్వుల ఉండలతో పాటు పలు పోషక విలువలున్న పిండి వంటలను ప్రదర్శించారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్ జిల్లా ఏంకర్ పర్సన్ నీలవేణి మాట్లాడుతూ మనకు విరివిగా లభిస్తున్న పోషకాహార దినుసులతో పౌష్టికాహారాన్ని తయారుచేసుకోవచ్చన్నారు. అనంతరం సామూహిక సీమంతం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చంద్రరాణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ఏపీఎం ఆదినారాయణ, హెచ్‌ఎన్ సీసీ నిర్మల, రాజవొమ్మంగి క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం రాజు ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో పౌష్టికాహార ప్రదర్శన జరిగింది. సామూహిక సీమంతాలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, వెలుగు సీసీలు , మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సారా పులుపు ధ్వంసం



సారా పులుపును ధ్వంసం చేస్తున్న యూత్ సభ్యులు

గూడెంకొత్తవీధి: రింతాడ పంచాయతీ గుర్రాలగొంది గ్రామంలో వార్డు సభ్యులు పాల్గు, వలంటీర్ సుందరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సారా పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. యూత్ కమిటీ సభ్యులు శ్రీరామ్, రామారావు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

కొయ్యూరు: పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా రాజేంద్రపాలెం ఆస్పత్రిలో సోమవారం వైద్యు డు సంపత్‌బాబు ఆధ్వర్యంలో సుమారు 120 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో 85 మందికి, చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ జి.శిరీష ఆధ్వర్యంలో 108 మంది గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. స్కానింగ్, రక్తపరీక్షలు చేసి, మందులు అందజేశారు. వారిలో 34 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆయా ఆస్పత్రుల్లో జాయిన్ చేసుకున్నారు. గర్భిణులకు భోజన, వసతి, రవాణా సౌకర్యం కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాహుల్, గైనకాలజిస్టు ఆర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మాణానికి కృషి



కూలిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సుమాంజలి తదితరులు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని వైస్ ఎంపీపీ సుమాంజలి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి తదితరులు సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి నాడు-నేడు ద్వారా పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్ నాగేంద్ర, గ్రామస్తులు తదితరులున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎంపీపీ రాజు

హుకుంపేట: తాడిపుట్టులో ఎంపీపీ కూడా రాజుబాబు సోమవారం పర్యటించారు. గ్రామంలో తొడమ్మ అనే వృద్ధురాలికి సాంకేతిక కారణాల వల్ల పింఛన్ అందక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. ఆమెకు నిత్యావసర సరకులు, అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని అన్ని వేళల్లో ఆదుకుంటామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాల సేవలపై అవగాహన



కేక్ కట్ చేస్తున్న ఐపీవో ఉపేంద్ర

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పోస్టాఫీసులో ప్రపంచ తపాల శాఖ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీవో ఉపేంద్ర సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అయన మాట్లాడుతూ తపాల శాఖ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సిబ్బంది రవి, భాస్కర్‌రావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ రుణాలు



మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను

అరకులోయ రూరల్: పీఏసీఎస్ తరపున రైతులకు వ్యవసాయ రుణాలు అందజేస్తున్నామని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న రైతులకు ఇప్పటిక వరకు రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. అర్హులందరూ సభ్యత్వం నమోదు చేసుకొని రుణాలు పొందవచ్చన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సింగ్, మల్లేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: ప్రభుత్వం అందించిన మినుము విత్తనాలను జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ, ఎంపీడీవో వీరకిషోర్, వైస్ సర్పంచ్ వీరబాబు, ఏవో వెంకటేశ్వర్లు సోమవారం పంపిణీ చేశారు. రైతులు రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. సత్యనారాయణ రెడ్డి, సిబ్బంది సుమతి తదితరులున్నారు.

పెదబయలు: పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ రాజారవికుమార్ చెప్పారు. విత్తనాలు అవసరమైన వారి రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

సాక్షి, పాడేరు: హుకుంపేట మండలం ఉప్పా గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 58 బాటిళ్లను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్ ఫోర్స్ సీఐ కూర్మారావు చెప్పారు. ఇక్కడ మద్యం అక్రమాలు అక్రమంగా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడుల చేసి బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలి

గంగవరం: మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతూ స్థానిక యువకులు అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ సదుపాయం లేక వర్షాలు కురిసినపుడు మురుగునీరు గృహాల్లోకి చేరుతోందని, స్థానికులు దుర్గంధలు నివసించలేకపోతున్నారని, సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

టీటీడీ సేవలపై విస్తృత ప్రచారం

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ ఒడ్డున శ్రీరామ మాలధారులు సోమవారం ఆత్మీయ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో సమరసత ఫౌండేషన్ తరఫున పుణ్యక్షేత్రాల పర్యటనపై చర్చించారు. టీటీడీ సేవలపై గ్రామాల్లో విస్తృత ప్రచారంపై తీర్మానించారు. పనస, కుమ్మరిపుట్టు గ్రామాలకు చెందిన 60 మంది శ్రీరామ మాలధారులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

వీఆర్ పురం: రేఖపల్లి సచివాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలోని రేఖపల్లి గ్రామంలో చేపట్టనున్న గృహ సర్వేకి ఇంటి యజమానులు పూర్తి వివరాలు వెల్లడించి సహకరించాలని కోరారు. ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సర్పంచ్‌లు రామారావు, సరోజనీ, నాయకులు గంగులు, వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిషన్ సభ్యుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

రూ. 95 లక్షలతో నాడు-నేడు పనులు



నాడు-నేడు పనులకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కౌన్సిలర్ కర్రి లక్ష్మి

యలమంచిలి : పేద విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందించాలనేదీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల అని మున్సిపల్ చైరపర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. పట్టణంలో 1వ వార్డు సోమలింగపాలెంలో సోమవారం ఆమె నాడు-నేడు పనులకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందనీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా ఆంగ్ల మాధ్యమం ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అమలు జరిగే విధంగా చూస్తున్నారనీ ఆమె అన్నారు. పట్టణంలో నాడు-నేడు పనుల్లో భాగంగా అన్ని స్కూళ్లకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసిందనీ సోమలింగపాలెం ఉన్నత పాఠశాల్లో అదనపు తరగతి గదులు నిర్మాణానికి రూ. 95 లక్షలతో పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. వార్డు కౌన్సిలర్ కర్రి లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో పంటపొలాలకు వెళ్లే కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పించాలనీ ఆమె విజ్ఞప్తి చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శివ మాట్లాడుతూ శారదానది దాటుకొని రైతులు పొలాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించాలని, పంటకాలువల వద్ద మైనర్ వంతెనలకు గేట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, అత్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, ఎంపిపి బొదుపు గోవిందు, జెడ్పీటీసీ శానాపతి సంధ్యారాణి రాము, పట్టణ వైఎస్సార్‌షీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పిల్లా రమేష్, విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికార్లు, ప్రజాపతినిధులు పాల్గొన్నారు.

గోడలు ముట్టుకుంటే విద్యుత్ షాక్!

అచ్యుతాపురం(అనకాపల్లి): భారీ వర్షాలకు చెమ్మగిల్లిన ఎంఈవో కార్యాలయ గోడలకు కరెంట్ పాస్ అవ్వడంతో సోమవారం కార్యాలయ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన ఈ భవనం పైన లీకేజీల వల్ల నీటితో గోడలు తడవడంతో కరెంట్ పాస్ కావడంతో సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com